


సంచిక : 6 'వాసన్' నెట్‌వర్క్ త్రైమాసిక పత్రిక ఏప్రిల్ - జూన్, 2008

# వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల అమలుకు కొత్త మార్గదర్శక సూత్రాలు

హనుమంతరావు కమిటీ 1994లో ఇచ్చిన నివేదిక ఆధారంగా భారత ప్రభుత్వం 1995లో వెలువరించిన మార్గదర్శక సూత్రాలు ఒక రకంగా విప్లవాత్మకమైనవని చెప్పుకోవాలి. సహజ వనరుల యాజమాన్యంలో కీలక నిర్ణయాలన్నింటినీ ప్రజల సంస్థలకి ఇవ్వటమే కాకుండా నిధులను కూడా వాటికి అందచేశారు. దీర్ఘకాల ఫలితాలు, సుస్థిరతపై దృష్టిపెట్టి కరువు ప్రభావాన్ని తగ్గించటానికి ప్రాముఖ్యతనిచ్చారు. ఆ తరువాత 2001లో సవరించిన మార్గదర్శక సూత్రాలు, 2003 హరియాలి మార్గదర్శక సూత్రాలు పై అంశాలలో ఒక అడుగు ముందుకు వేస్తే రెండు అడుగులు వెనక్కి వేసినట్లు ఉన్నాయి.

ఈ పరిస్థితిని 11వ ప్రణాళికా సంఘం, జాతీయ వర్షాధార ప్రాంతాల ఆథారిటి (ఎన్ఆర్ఏటి) చక్కదిద్దటానికి ప్రయత్నించాయి. వీటి కృషి ఫలితంగా భారతదేశంలోని అన్ని వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాలకు కొత్త మార్గదర్శక సూత్రాలు ఏప్రిల్ 1, 2008 నుండి అమలులోకి వచ్చాయి.

ఈ మార్గదర్శక సూత్రాలలో వాటర్‌షెడ్ పథకాల అమలు పాత్రని స్వచ్ఛంద సంస్థలకు కూడా అప్పగించాలనుకోవటం ఆహ్వానించదగ్గ విషయం. దీంట్లోని మరికొన్ని ముఖ్య అంశాలు:

- ❑ అవసరాన్ని బట్టి ప్రాజెక్టును 4 నుంచి ఏడు సంవత్సరాల పాటు అమలు చేయటం
- ❑ తయారీ దశ, పనుల దశ, కన్సాలిడేషన్ దశ అన్న మూడు దశలలో కార్యక్రమాన్ని అమలు చేయటం
- ❑ ఉత్పాదకత పెంపుదల, జీవనోపాధులకు ప్రత్యేక కేటాయింపులు
- ❑ కార్యక్రమం అమలుకు దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక, అంకిత సంస్థల ఏర్పాటు
- ❑ సామర్ధ్యం పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలు, అవసరాన్ని బట్టి అదనపు నిధుల కేటాయింపు

ఈ మార్గదర్శక సూత్రాలలోని అనేక అంశాలు మన రాష్ట్రంలోని అనుభవాల ఆధారంగా రూపొందటం మనం సంతోషించదగ్గ విషయం. అయితే అమలుకు సంబంధించి అనేక అంశాలలో మార్గదర్శక సూత్రాలు నిర్దిష్టంగా లేవు. ఉదాహరణకు నిధులు విడుదలకు మార్గదర్శకాలను ఒకవైపు ఇస్తూ ఇంకో వైపు ఇవి అమలు చేయలేని పక్షంలో ప్రస్తుత విధానమే కొనసాగించవచ్చని చెప్పారు.




ఈ మార్గదర్శక సూత్రాలను తెలుగులోకి అనువదించి, తెలుగు, ఇంగ్లీషులతో ఒకే పుస్తకంగా వాసన్ వెలువరించింది. దీని వెల 40 రూపాయులు. ప్రతులు కావలసిన వారు వాసన్‌ని సంప్రదించగలరు.



# భూసారం కోసం బయోమాస్ – ఉపాధి హామీ పథకం

పదకొండవ పంచవర్ష ప్రణాళిక స్టీరింగ్ కమిటీ పేర్కొన్న రెండవ ప్రధానమైన సమస్య నేలకోత, నేల చౌడు బారటం, రసాయనీకరణ వల్ల భూ వనరులు క్షీణతకు గురి కావటం. పోషకాల వాడకంలో సమతౌల్యత లోపించటం, సూక్ష్మ పోషక పదార్థాలు లోపించటం, సేంద్రియ ఎరువులు చాలినంతగా వేయకపోవటం వల్ల భూమి ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతోందని ఈ కమిటీ పేర్కొంది. ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని అల్బర్ట్ హోవర్డ్ నుంచి రాయల్ కమీషన్ వరకు ఎందరో, ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నా ఈనాటికీ 'నత్రజని-భాస్వరం- పొటాషియం'ల లో మునిగిపోతున్న శాస్త్రజ్ఞులు ఉన్నారు. సాగు నీటి తరువాత రసాయనిక ఎరువుల సబ్సిడీపై అత్యధికంగా సంవత్సరానికి 40,000 కోట్ల రూపాయల భారాన్ని ప్రభుత్వం మోస్తోంది.

శాస్త్రజ్ఞులు తమ హస్వ దృష్టితో పెనుముప్పుకు కారణమవుతున్నారు. భూ రసాయనిక శాస్త్రం వైపు మొగ్గు చూపి నేల భౌతిక లక్షణాలను, జీవ గుణాలను, పునరుద్ధరణ శక్తిని విస్మరిస్తున్నారు. నేల ఆరోగ్యంగా ఉండటమంటే పోషకాల గుళికాలు వాడటం అనుకుంటున్నారు. భూమి ద్వారా దేశ ప్రజలకు పోషణ అందాలంటే ముందుగా నేలలకు పోషణ అందాలి.

దీనికి వెనువెంటనే ఎదురయ్యే ప్రశ్నలు 'అంత బయోమాస్ ఎక్కడ ఉంది?', 'వర్షాధార ప్రాంతాలలో నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచటం కష్టం', 'పని చేసే వాళ్ళు ఏరి?'ఇలా ప్రశ్న పరంపర (పశువులు ఏవి, ఉమ్మడి భూములు ఏవి) సంధిస్తామే గానీ జవాబుల కోసం అన్వేషించటం లేదు.

అయితే వర్షాధార రైతులు చేయగలిగిన పనులు కొన్ని ఉన్నాయి:

❑ పంటకు నష్టం కలిగించని చెట్లను గట్ల మీద పెంచటం
❑ సంవత్సరంలో కనీసం రెండుసార్లు పెద్దఎత్తున ఏరోబిక్ కంపోస్టింగ్ చేపట్టడం
❑ తక్కువ పెండతో ఎక్కువ ఎరువు తయారు చేయటం
❑ పంట భూముల వద్ద, పశువుల కొట్టాల దగ్గర సరైన కంపోస్టింగ్ విధానాన్ని చేపట్టడం
❑ కంపోస్టింగ్ తొందరగా అయ్యే పద్ధతులు
❑ నీళ్ళు, శ్రమ తక్కువ అవసరమయ్యే కంపోస్టింగ్ పద్ధతులు.

పేడ వినియోగ సామర్థ్యాన్ని పెంచటం ద్వారా (ఉత్ప్రేరకంగా వాడుకుని) పశువులపై ఆధారపడటాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చు. బయోమాస్ చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించటానికి 'నర్సరీ' ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. పచ్చిరొట్ట పంటలను అంతర పంటలుగా సాగు చేయవచ్చు. వీటన్నింటి ద్వారా ఎకరానికి రెండు టన్నుల సేంద్రియ పదార్థాన్ని ప్రతి సంవత్సరం అందించటం అంత కష్టం కాకపోవచ్చు.

అయితే రైతులు ఇలా చెయ్యకపోవటానికి కొన్ని కారణాలు ఉన్నాయి. బయోమాస్‌ని ఇచ్చే మొక్కలు అందుబాటులో లేవు, వీటికి కనీసం రెండు సంవత్సరాల పాటు రక్షణ, నీళ్ళు అవసరమవుతాయి. ఖర్చులు కూడా కొంత ఎక్కువే. దీనికి కావలసినదంతా ఎకరానికి కొన్ని రోజుల పనికి రైతులకు సహాయాన్ని అందించటం.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకునే ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ ద్వారా కూలీల ఖర్చుని సబ్సిడీగా అంద చేయాలి. అయితే 'ఉపాధి హామీ'లో కొన్ని సమస్యలున్నాయి. ప్రస్తుతం ఎరువు గుంతను అనుమతిస్తున్నారు కానీ, 'ఎరువు తయారీ'కి అవకాశం లేదు. భూమి అభివృద్ధి కింద మొత్తం భూమిని చేపట్టడం లేదు. అంతేకాకుండా సాంకేతిక ఫెసిలిటేషన్‌కి కార్యక్రమంలో అవకాశం లేదు.

ఇది సాధ్యం కావాలంటే ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులు చెయ్యాలి. ఈ పథకం కింద గృహ నిర్మాణం, పండ్ల తోటల పెంపకం చేపట్టగాలేనిది నేల ఆరోగ్యాన్ని, ప్రత్యేకించి జైవిక గుణాలను పెంపొందించటానికి ఒక ప్రత్యేక జాతీయ కార్యక్రమాన్ని రూపొందించి ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చెయ్యలేమా? బయోమాస్ చెట్ల నర్సరీ, కంపోస్టింగ్‌కి నీళ్ళు పొయ్యటం, రవాణా వంటివి గ్రామస్థాయిలో హక్కులుగా పొందుపరచాల్సి ఉంది.

**- ఎ. రవీంద్ర, సి. బక్కారెడ్డి**
వాసన్



# పలు ఉపయోగాల అజోలా

అజోలా అన్నది నీటి మీద తేలుతూ పెరిగే ఫెర్న్ జాతికి చెందిన మొక్క. ఇది నీటి గుంతలలో, తేమ ప్రాంతాలలో భారత దేశమంతటా సహజంగా ఉంటుంది. దీనితోపాటే నీలి, ఆకుపచ్చ నాచు పెరుగుతూ ఉంటుంది. ఇది గాలిలోని నత్రజనిని అమోనియా రూపంలో స్థిరీకరిస్తుంది. ఆ విధంగా ఇది జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. ఎండిన అజోలాలో 5 శాతం నత్రజని, 2-4.5 శాతం పొటాష్ ఉంటాయి.



అజోలాని ఈ కింది విధంగా సాగు చెయ్యాలి: చేనులో అర్ధమీటరు కట్టలు వేసి 3 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు మడులు తయారు చెయ్యాలి. మడిలో 15 సెంటిమీటర్ల లోతు నీళ్లు పెట్టాలి. అజోలాని చదరపు మీటరుకి వందగ్రాముల చొప్పన 'విత్తనం'గా వెయ్యాలి. అదేవిధంగా భాస్వరం అందించటానికి ప్రతి వంద చదరపు మీటర్ల మడికి 200 గ్రాముల ఎస్ఎస్‌పి వెయ్యాలి.

అజోలా చాలా వేగంగా పెరిగి రెండు వారాలలో నీటిపై మందపాటి పొరగా ఏర్పడుతుంది. ఇలా ప్రతి 15-20 రోజులకు ఒకసారి అజోలాని తీసుకోవచ్చు. చలికాలంలో ఎదుగుదల తక్కువగా ఉండి 25-30 రోజులకు తయారవుతుంది. ఈ అజోలాని ఎరువు తయారీలో వినియోగించవచ్చు. వరి పొలాల్లో వేయవచ్చు. దీనివల్ల వరిలో నత్రజని ఎరువుల అవసరం తగ్గుతుంది. కలుపును అరికడుతుంది. ఆవిరి అయ్యే నీరు తగ్గి, నీటి సామర్థ్యం పెరుగుతుంది. ఎండిన అజోలాని కోళ్లకి, చేపలకి మేతగా ఉపయోగించవచ్చు. సన్న జీవాలకి, పెద్ద జీవాలకి కూడా పెట్టవచ్చు.

**- దేశు బాలరాజు**, కృషి విజ్ఞాన కేంద్రం, మాగంటిపల్లె, కర్నూలు జిల్లా

## మాతృభూమిని కనుగొందాం!

మీరు పట్టభద్రులా? మీ జీవితంలో ఒక సంవత్సరం పాటు ఏదైనా ఆసక్తికరమైన పని చేయాలని అనుకుంటున్నారా?

అసలైన భారతదేశాన్ని కనుగొనండి!

మిమ్మల్ని మీరు కనుగొనండి!!

ఒక సంవత్సరం పాటు ఓ గ్రామాభివృద్ధి సంస్థతో ఈ దిగువ అంశాలపై పని చేసే అవకాశాన్ని మీకు 'చిరాగ్', 'ఫోర్డ్ ఫౌండేషన్' కల్పిస్తున్నాయి (దీనికి మీకు గౌరవ వేతనం కూడా అందుతుంది).

★ ప్రాథమిక విద్య ★ రోగ నివారణ, ఆరోగ్యం పెంపుదల

★ పర్యావరణ పునరుద్ధరణ ★ గ్రామీణ జీవనోపాధులు

ఈ కార్యక్రమం 2008 జులై 1 నుంచి మొదలవుతుంది. మీ దరఖాస్తులు మాకు 2008 మే 15లోపు చేరాలి.

రండి, మార్పును తీసుకురావడంలో మాతో చేతులు కలపండి.

చూడండి వెబ్ : www.chirag.org

రాయండి: youth@chirag.org

మాట్లాడండి: 94120 85732, 05942 285738

**వెబ్‌సైట్ పరిచయం**




## పురుగు మందులు లేని వ్యవసాయానికి ఆన్‌లైన్ సహాయం

పురుగు మందులు లేకుండా వ్యవసాయాన్ని చేపట్టటానికి కావలసిన చాలా సమాచారం ఇప్పుడు వెబ్‌లో అందుబాటులో ఉంది. ఇంగ్లీషులోని ఈ సమాచారాన్ని పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్, జర్మనీ వారు www.oisat.orgలో పొందుపరిచారు.

పురుగు మందులు లేని వ్యవసాయ పద్ధతుల సూత్రాలతో పాటు పంటలు, పురుగులు, తెగుళ్ళు, నియంత్రణ పద్ధతుల వారీగా సమాచారం ఉంది. అంతేకాకుండా వివిధ అంశాలకు సంబంధించి పుస్తకాలకు, ఇతర వెబ్‌సైట్లకు లింకులు కూడా ఇందులో ఉన్నాయి. వివిధ పంటలలో పురుగు మందులు లేకుండా సాగు చేయడానికి కరదీపికలతో పాటు 'ఎండోసల్ఫాన్ లేకుండా పంటలు ఎలా పండించాలి' అన్న కరదీపిక కూడా ఇందులో ఉంది.

# భాగస్వామ్యం




పౌర సమాజం, ప్రజాస్వామిక పాలన అంశాలపై సమకాలీన విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందించడానికి 'భాగస్వామ్యం' పత్రిక కృషి చేస్తోంది. అట్టడుగు స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు, పౌర సమాజ సంస్థల నైపుణ్యం, వృత్తివాదాన్ని ప్రోత్సహించి అభివృద్ధి రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వెలువడుతున్న పత్రిక ఇది.

రాజ్యం, పౌర సమాజం మధ్య ప్రజా విధానాల రూపకల్పన ప్రక్రియలో ఒక ఫలవంతమైన సహకారం బలపడే క్రియా విధానాన్ని అభివృద్ధి చేస్తుంది 'భాగస్వామ్యం'. వర్తమాన సమాజానికి ఉపయోగపడడమే కాకుండా, భవిష్యత్తు తరాల కోసం కూడా ఈ విధానాన్ని రూపొందించడం మా లక్ష్యం. అంతేకాకుండా సమాజాధారిత సంస్థలతో పనిచేస్తూ వారితో సమాచారాన్ని, అనుభవాలను పంచుకుంటూ పౌర సమాజ వేదికల వృత్తి సామర్థ్యాలను, సంప్రదింపుల నైపుణ్యాన్ని పటిష్టం చేసి సమాజ సమస్యలపై సరికొత్త పరిష్కారాన్ని ఆవిష్కరిస్తుంది.

ప్రభుత్వేతర, పౌర సమాజ సంస్థలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సలహాలు, సూచనలు, ఎలాంటి పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి, వాటిని ఇతరులతో పంచుకుని మరిన్ని అవకాశాలు పొందేందుకు తెలుగులో 'భాగస్వామ్యం' వెలువడుతోంది.

వివిధ అంతర్జాతీయ, జాతీయ సంస్థలు ఫండ్స్, గ్రాంట్స్ అందించే విధానం, ఆ సంస్థల ప్రాధాన్య అంశాలు ఎలా ఉంటాయి, మంచి ఎన్‌జిఓ లేదా సిఎస్‌ఓగా ఎలా ఎదగాలి, సమాజానికి ఎలాంటి సేవలందిస్తే బాగుంటుందో వంటి వివరాలు ఇందులో ఉంటాయి.

సమాచార హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మైక్రోప్లానింగ్, శిక్షకులకు శిక్షణ, సర్వే పరిశోధనలు, అధ్యయనాలు తదితర అంశాలు, అభివృద్ధి, ఎన్‌జిఓ/ సిఎస్‌ఓలకు సంబంధించిన సమాచారం, సలహాలను 'భాగస్వామ్యం' అందిస్తుంది. సంప్రదించండి: ఎడిటర్ 'భాగస్వామ్యం', ఇంటి నెం. 1-1-336/4, వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాద్. 500 020. ఆం.ప్ర. ఫోన్: 94401 36718, 99482 56377, 98488 91852, ఇ-మెయిల్: bhagaswamyam@gmail.com

## శ్రీ పద్ధతిపై వెలువడనున్న పత్రిక

సాగునీటిని సద్వినియోగం చేస్తూ, ఖర్చులు తగ్గించే శ్రీ పద్ధతిని ప్రోత్సహించటానికి ఇంగ్లీషులో ఒక పత్రిక తేవాలన్న తలంపుతో ఉన్నారు. దీనికి డబ్ల్యుడబ్ల్యుఎఫ్, సర్ దొరబ్‌జీ టాటా ట్రస్టులు సహకరించ నున్నాయి. కేవలం వరిలోనే కాక ఇతర పంటలలోనూ శ్రీ పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇంకా పేరు ఖరారు చెయ్యని ఈ పత్రికలో దిగువ పేర్కొన్న అంశాలు ఉంటాయి:

★ విజయ గాథలు ★ అనుభవాలను పంచుకోవటం ద్వారా నేర్చుకోవడం ★ సమస్యలను బాగా అర్థం చేసుకుని, వాటికి పరిష్కారాలను వెతకడం ★ శ్రీ పద్ధతులను అవలంబించటానికి కొత్త వారిని ప్రోత్సహించటం ★ పాలసీ అడ్వకసీకి ఉపయోగించటం ★ రైతుల, శాస్త్రజ్ఞుల పరిశోధనల ఫలితాలను పంచుకోవటం ★ కొత్త ఆవిష్కరణలను, శిక్షణా మార్గదర్శులను పంచుకోవటం ★ వార్తలు, అభిప్రాయాలు, సమాచారాలను వ్యాప్తి చెయ్యటం ★ పరికరాలలో (వీడర్లు, మార్కర్లు) ప్రగతిని పంచుకోవటం ★ శ్రీ పద్ధతిపై ప్రాంతీయ, జాతీయ నెట్‌వర్క్‌లను ప్రోత్సహించటం. మరిన్ని వివరాలకు సంప్రదించండి:

డా॥ భిక్షం గుజ్జా info@sri-india.net

## సుస్థిర అభివృద్ధి వేదిక ఆరంభం

ప్రజా జీవనంలోని అన్ని రంగాలలో సుస్థిర అభివృద్ధి కోసం 'ఫోరం ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్' అన్న స్వచ్ఛంద సంస్థ హైదరాబాదులో మొదలయ్యింది. ఇది స్వచ్ఛంద సంస్థగా రిజిస్టరు అయ్యి సర్వధారి ఉగాది (ఏప్రిల్ 7, 2008) నుంచి మొదలయ్యింది. దీంట్లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి కిషన్‌రావ్, నీటి వనరులకు జీవానందరెడ్డి, పట్టణ రవాణా వంటి అంశాలకి కెప్టెన్ రామారావు నేతృత్వం వహిస్తున్నారు. దీనికి అధ్యక్షులుగా ఐఐసిటి రిటైర్డ్ శాస్త్రవేత్త బాబురావు గారున్నారు. మరిన్ని వివరాలకు చూడండి www.fsdhyd.org.

**- పర్చా కిషన్ రావు, ఉపాధ్యక్షులు**

## ఆర్ఐడిఎఫ్ 13, ఉపాధి హామీలతో పేదల భూముల అభివృద్ధి

నవంబరు 2004లో మొదలైన ఇందిరప్రభ పథకం (ఆర్ఐడిఎఫ్ -9,10) కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం లక్షమందికి చెందిన లక్షన్నర ఎకరాల అసైన్డ్ భూమి సమగ్ర అభివృద్ధిని చేపట్టింది. ఈ పథకానికి ఆర్ఐడిఎఫ్ -13 కింద నాబార్డు నుండి 150 కోట్ల రూపాయలు, ఉపాధి హామీ పథకం కింద సుమారు 170 కోట్ల రూపాయల కేటాయింపుతో అంచనాలు రూపొందించారు.

గత మూడు సంవత్సరాల అనుభవాలతో ప్రణాళిక తయారీలో, పథక అమలు ఏర్పాట్లలో మార్పులు చేశారు. ఈ వివరాలతో సర్క్యులర్ -18, 19లు జారీ చేశారు. ఆర్ఐడిఎఫ్‌లో రెండు ముఖ్యమైన అంశాలు:

1 ఇందిరప్రభలో ఎంపిక చేసిన భూముల అభివృద్ధికి ప్రణాళికలు హక్కుదారుల పూర్తి భాగస్వామ్యంతో జరగాలి. దీనికోసం ఆర్ఐడిఎఫ్-9,10 పథకంలో తమ భూములను స్ఫూర్తిదాయకంగా బాగు చేసుకుని సాగులోకి తెచ్చుకున్న వారిని కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్ (సిఆర్‌పి)లుగా ఎంపిక చేసి తగిన శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకుంటారు. వీరు నిర్వర్తించే విధులు:
   - ❑ అవగాహన కల్పించటం
   - ❑ ఉమ్మడి ప్రయోజనాల బృందాలు ఏర్పాటు చెయ్యడం
   - ❑ రైతువారీ ప్రణాళికలు తయారు చెయ్యడం
   - ❑ గుర్తించిన పనులు, అమలు ఏర్పాట్లపై తీర్మానాలు చేయించడం

2 ఆర్ఐడిఎఫ్ -13లో మనుషులు చేయగలిగిన భూమి అభివృద్ధి పనులు ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తారు. కేవలం యంత్రాలు, సామాగ్రి అవసరమైన పనులు (బోర్లు, విద్యుత్ సౌకర్యం) వంటివి నాబార్డు నిధులతో చేపడతారు.

ఇకనుండి ఇందిరప్రభ పథకానికి సంబంధించిన బ్లాకువారీ వివరాలు, ఉపాధి హామీ పథకంలో లాగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. అంచనాలు, ప్రణాళికలు, చెల్లింపు వివరాలు అన్నీ మండల కంప్యూటర్ సెంటర్ ద్వారా పొందుపరుస్తారు.

గత అనుభవాలతో చేసిన ఈ మార్పులు పథక సక్రమ అమలుకు తోడ్పడతాయని ఆశించవచ్చు. అయితే వివిధ ప్రజా సంఘాలు, సంస్థలు తమ నిరంతర పర్యవేక్షణ కొనసాగించవలసి వుంది.

**- సిహెచ్. రవి, వాసన్**

## బాబా ఆమ్టే - మన కాలం గాంధి

బాబా ఆమ్టేగా ప్రసిద్ధి చెందిన మురళీధర్ దేవిదాస్ ఆమ్టే చనిపోయిన వార్త వినగానే మన కాలపు గాంధీగా మదిలో మెదిలాడు. గాంధేయవాది అన్న పేరు చాలా మందికి ఉంది కానీ చాలా మందిలో గాంధీలాగా పోరాటపటిమ లేదు. పరిణామాలను పట్టించుకోకుండా అన్యాయాలకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వ్యక్తి బాబా ఆమ్టే.

మధ్య భారతంలో బాబా ఆమ్టే స్థాపించిన నాలుగు ఆశ్రమాలు బాగా ప్రసిద్ధి చెందాయి. ఇందులో మూడు కుష్టు వ్యాధిగ్రస్తులకు కాగా (ఆనందవనం, సోమనాథ్, అశోకవనం) ఒకటి గిరిజనులకు (హేమల్‌కస్సా). అతని కలలు, వాటిని అమలు చేసిన తీరు ఈ ఆశ్రమాలలో ప్రతిఫలిస్తుంది.



ఇరవై సంవత్సరాల క్రితం నేను ఉద్యోగం వదిలిపెట్టి ఆనందవనంలో గడిపిన ఆరునెలలు నాలో చిరస్మరణీయంగా ఉండిపోతాయి. పంజాబ్‌లోని ఉగ్రవాదానికి, నర్మదా నదిపై ఆనకట్టల నిర్మాణానికి వ్యతిరేకంగా బాబా ఆమ్టే పోరాడాడు. నర్మదా నదీ పథకాలకు వ్యతిరేకంగా 1990 ఆరంభంలో చేపట్టిన పాదయాత్ర మధ్యప్రదేశ్ - గుజరాత్ సరిహద్దుకి చేరగానే ఒకవైపున గుజరాత్ రాష్ట్ర పోలీసు బలగాలు, ఇంకోవైపున పాద యాత్రికులు మోహరించి ఉన్నారు. విచిత్రం ఏమిటంటే గాంధీ పుట్టిన గుజరాత్‌లోని ప్రభుత్వం పాదయాత్రికులను ఆపటం! చాలీచాలని బట్టలతో, చలి రాత్రిళ్ళు గడిపి, కొంతమంది 22 రోజుల పాటు నిరాహార దీక్షలు చేసి గాంధీ వర్ధంతి అయిన జనవరి 30న నిరశనను విరమించుకున్నారు.

నా మిత్రుడు శ్రీకుమార్ రాసిన కవితలోని ఒక చరణంతో ఈ స్మరణను ముగిస్తున్నాను.

*"ఏరీ ఆ మంచివాళ్ళు, ఎటు వెళ్ళిపోయారు?*

*తమ కళ్ళల్లో గుండెలను మోసుకుని తిరిగేవారు ఏరీ?*

*ప్రశ్న అడగటానికి పిల్లలు మాటలు కూడగట్టుకుంటే ఓపికగా ఉండేవాళ్ళు,*

*తమలోని అజ్ఞానాన్ని బాగా గుర్తెరిగిన వారు, అయినా*

*తాము నమ్మిన దానికోసం నిర్భయంగా పోరాడేవారు,*

*ఎంతో చదివిన వారు, అయినా కొత్త పుస్తకం దొరకగానే ఎగిరి గెంతేసే వారు,*

*బాహ్యమైన వాటికి పడిపోక అంతర్గతమైన వాటిని గుర్తించేవారు*

*తమ ప్రాముఖ్యతను చాటుకోకుండా సాగిపోయేవారు, ఏరీ?"*

**- హిమాంషు ఠక్కర్**



# సుస్థిర అభివృద్ధి సాధించిన ఏకైక దేశం... క్యూబా



భూమాతకు సహనం ఉందంటారు.! కానీ తను కూడా ఓర్చుకోలేనంత పాపం చేస్తున్నారట మనుషులు.... ఆ వినాశకర పాపభారాన్ని మోస్తూ, మన మనుగడకు ఆధారమైన సహజవనరుల పునరుత్పత్తి ఇక తనవల్ల కాదంటోంది భూగోళం! అభివృద్ధి చెందాయని మనం భావిస్తున్న 'సంపన్న దేశాలు' అసలు భూగోళం ఉనికికే 'ప్రమాద కారక' దేశాలుగా మారుతున్నాయి. పర్యావరణం దెబ్బతినడానికి 'మూడొంతుల' కన్నా ఎక్కువ పాపం ఈ సంపన్న దేశాలదే! తప్పు చేస్తున్న ఈ దేశాలతో సహా ప్రపంచంలో అన్ని దేశాలు ఇప్పుడు వల్లె వేస్తున్న ఒక పదం - సుస్థిర అభివృద్ధి. మాట్లాడుతున్న మాట పట్ల ఈ దేశాలకు ఎంత నిబద్ధత ఉందో తెలియదు కానీ.... ఎక్కువగా మాట్లాడని ఒక చిన్న దేశం 'సుస్థిర అభివృద్ధి' అంటే ఏమిటో సాధించి చూపింది. మాటలకు చేతలకు ఉన్న తేడా ఏమిటో మిగతా దేశాలకు చాటింది.... ఆ చిన్న దేశం ... క్యూబా! ప్రపంచంలో సుస్థిర అభివృద్ధిని సాధించిన ఏకైక దేశం క్యూబా అని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్), గ్లోబల్ ఫుట్ ప్రింట్స్ నెట్‌వర్క్ తాజాగా విడుదల చేసిన 'లివింగ్ ప్లానెట్' నివేదిక ప్రకటించింది.

సాధించిన సామాజిక అభివృద్ధి, విద్యా, వైద్య రంగాలలో ప్రగతితో పాటు 'అందుబాటులో ఉన్న సహజ వనరులను తనకు అవసరమున్న స్థాయిలోనే వినియోగించుకోవడం' అన్న కీలక ప్రామాణికం ఆధారంగా క్యూబాకు సుస్థిర అభివృద్ధి రేటింగ్ దక్కింది. అగ్రరాజ్యం అమెరికా కుట్రలు, ఆర్థిక దిగ్బంధాలను యాభై ఏళ్లపాటు తట్టుకుని నిలబడింది ఈ దేశం.... ఒకప్పుడు మామూలు పేద దేశం..... ఇప్పుడు స్వయం సమృద్ధి సాధించిన సుస్థిర దేశం!...

ఇది ఆషామాషీగా సాధించిన విజయం కాదు. తరతరాలుగా వలసవాదులు, సామ్రాజ్యవాదుల చేతిలో అతలాకుతలమైంది ఈ దేశం. 1959లో ఫిడెల్ కాస్ట్రో నాయకత్వాన ప్రజా తిరుగుబాటు సామ్రాజ్యవాదులను తరిమేసింది. కొల్లగొట్టబడిన సహజ సంపద పునరుద్ధరణకు అప్పటినుంచీ ఆ దేశం ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఆ క్రమంలో అన్ని అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడింది. పర్యావరణ పరిరక్షణ చేపట్టింది. వాటి ఫలితంగా అడవుల విస్తీర్ణం 14 నుంచి 24.3 శాతానికి పెరిగింది. మిగతా కరేబియన్ దేశాల్లో అంతరించిపోయిన అపారమైన జలజీవ సంపదకు క్యూబా తీరప్రాంతం ఆశ్రయమిచ్చింది. అమూల్యమైన జల జీవ సంపదకు ఇది నెలవైంది.

## ఒకప్పుడు రసాయన వ్యవసాయం

విషకారక పురుగుమందులు, రసాయన ఎరువులకు క్యూబా వ్యవసాయం ఇప్పుడు చాలా దూరం. అయితే ఒకప్పుడు ఈ దేశంలో కూడా వ్యవసాయం మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాల మాదిరిగానే ఉండేది. ప్రధాన వాణిజ్య పంటలైన చెరకు, పొగాకు సాగులో భారీ యంత్రాలు, పెట్రోలియం ఆధారిత పెస్టిసైడ్స్, ఎరువులు బాగా వాడేవారు. వీటికోసం చాలా దేశాలు పశ్చిమదేశాలపై ఆధారపడితే క్యూబా ప్రధానంగా అప్పటి సోవియట్ రష్యాపై ఆధారపడేది. వ్యవసాయంపై పర్యావరణ ప్రభావం ఎలా ఉన్నా వ్యాపారపరంగా మాత్రం క్యూబా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండేది. 80 శాతం వ్యాపారం రష్యాతోనే చేసేది. అవసరమైన ఆహారధాన్యాల్లో సగానికి పైగా రష్యా నుంచే అందేవి. ఫలితంగా 80వ దశకంలోనే పారిశ్రామికంగా కూడా మంచి ప్రగతి సాధించింది. తలసరి స్థాయిలో డాక్టర్ల సంఖ్య, శిశు మరణాలు, ప్రాథమిక విద్య వంటి అంశాలలో మిగతా లాటిన్ అమెరికన్ దేశాలకన్నా మెరుగైన ప్రమాణాలు సాధించింది.

1991లో సోవియట్ రష్యా కుప్పకూలింది. దాంతో పాటే క్యూబా ఆర్థికవ్యవస్థ కూడా... చమురు దిగుమతులు 53 శాతం, బియ్యం. గోధుమలు, ఇతర ఆహార ధాన్యాల దిగుమతులు 50 శాతం వరకు పడిపోయాయి. అప్పటికి వ్యవసాయంలో వినియోగిస్తున్న

ఎరువులు, పురుగుమందుల దిగుమతులయితే 83 శాతం తగ్గాయి... ఆకలి, చావులు... అత్యంత దుర్భరమైన పరిస్థితి! అదే సమయంలో ఆ దేశాన్ని ఇరుకున పెట్టడానికి ఆమెరికా తన ఆర్థిక దిగ్బంధాన్ని మరింత బిగించింది. ఎలాగైనా కాస్ట్రోను గద్దె దించాలన్నదే అమెరికా లక్ష్యం!

## సుస్థిర వ్యవసాయం దిశగా......

ఆ పరిస్థితుల్లో కాస్ట్రో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంది. ఏం చేయాలన్న దానిపై లక్షలాది క్యూబా ప్రజల్లో విస్తృతమైన చర్చ మొదలుపెట్టింది. చివరకు ఒక నిర్ణయం తీసుకుంది.. మందులు, ఎరువులతో చేసే ఖర్చుతో కూడిన వ్యవసాయం కన్నా తక్కువ ఖర్చుతో కూడిన సహజ సిద్ధమైన వ్యవసాయ పద్ధతులే మేలని ఎంచుకుంది. అందుకు అనుగుణంగా మానవ వనరులను వినియోగించుకుంది. ప్రత్యామ్నాయ వ్యవసాయం, భూ వినియోగ పద్ధతులపై యువ శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేపట్టారు. పంటల సాగులో రసాయన ఎరువులకు బదులు వానపాముల ఎరువు, కంపోస్టు, బయో ఫెర్టిలైజర్లు వాడసాగారు. సహజ పద్ధతుల్లో పురుగుల నియంత్రణ చేపట్టారు. ట్రాక్టర్ల స్థానంలో దుక్కి పశువులను వాడారు. అంతకుముందు స్థూల వ్యవసాయ ఉత్పత్తిలో ప్రభుత్వ అధీనంలో ఉన్న పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాల వాటా 80 శాతం వరకు ఉండేది. అయితే వాటిలో ఉత్పత్తి అప్పటికే గరిష్ట స్థాయికి చేరిపోయింది. దాంతో ఈ పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలను చిన్న చిన్న కమతాలుగా మార్చారు. రైతు చేతికి భూమి అన్న కార్యక్రమం అమలుచేశారు. చిన్న చిన్న కమతాలను రైతుల అజమాయిషీలో ఉంచారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధీనంలోని భారీ వ్యవసాయ క్షేత్రాలు కాస్తా రైతుల అజమాయిషీలో సహకార క్షేత్రాలుగా మారాయి. దిగుబడుల్లో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వాటా పోను అదనపు దిగుబడిని రైతులు స్వంతంగా అమ్ముకునే వెసులుబాటు కల్పించారు......

రైతులు కూడా ఈ పద్ధతులకు త్వరగానే అలవాటుపడ్డారు. కొత్త పద్ధతులతో పాటు మిశ్రమ పంటల వంటి సాంప్రదాయ పద్ధతులను పాటిస్తున్నారు. తమ పరిజ్ఞానాన్ని జోడించి ఆ భూముల ఉత్పాదకత పెంచారు.

1998 కల్లా క్యూబా రాజధాని హవానా చుట్టుపక్కలే 8000 పట్టణ వ్యవసాయ క్షేత్రాలు, కూరగాయలు, పళ్ల తోటలు వెలిశాయి. దాదాపు 30000 మంది రైతులు వీటిని సాగుచేసేవారు. 2002 నాటికి ఇవి 32 లక్షల టన్నుల దిగుబడి అందించాయి. హవానాలో 50 శాతం, చుట్టుపక్కల పల్లెల్లో 80-100 శాతం కూరగాయల అవసరాలు ఇవి తీర్చసాగాయి. దేశం మొత్తం మీద వ్యవసాయంలో పనిచేసేవారి సంఖ్య 2 లక్షలకు పెరిగింది. అవసరమైన ముడివనరులు అందిం చడానికి 200 బయో పెస్టిసైడ్



కేంద్రాలు నెలకొల్పారు. ఇవి విత్తనాలు, ఉపకరణాలతో పాటు కంపోస్టు వంటి బయో ఫెర్టిలైజర్లను కూడా రైతులకు అందుబాటులో ఉంచుతాయి. 1989తో పోలిస్తే 2003 నాటికి వ్యవసాయం కోసం వాడే డీజిల్ ఇంధనాన్ని 50 శాతం క్యూబా వ్యవసాయ మంత్రిత్వ శాఖ తగ్గించేసింది. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం 10 శాతం కన్నా తక్కువకు పడిపోయింది.

మరోపక్క సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం, ఇంధన వినియోగ సామర్థ్యం పెంపు వంటి అంశాలపై దృష్టి నిలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌరశక్తి వినియోగం పెంచారు. చెరకు ఉప ఉత్పత్తి అయిన 'పిప్పి' ద్వారా తయారుచేసే విద్యుత్తు ఆ దేశ అవసరాల్లో 30 శాతం తీరుస్తోంది! ఇంధనం ఆదా చేయడానికి ప్రజా రవాణాలో కూడా సైకిళ్ల వాడకానికి ప్రభుత్వం బాగా ప్రోత్సాహం ఇచ్చింది. గత ఏడాదిని 'విద్యుత్ విప్లవ సంవత్సరం'గా ప్రకటించారు. దేశం మొత్తం మీద సరిగ్గా పనిచేయని కరెంట్ వ్యవస్థను చక్కదిద్దడానికి 30000 మంది యువకులతో ఒక విస్తృత ఉద్యమం చేపట్టారు. విద్యుత్ స్టేషన్‌లను పటిష్టం చేశారు. గాలి, బయోమాస్, సముద్ర ఉపరితల ఉష్ణం ఆధారంగా విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు చేపట్టారు. ఇలా 2006 నాటికి దేశంలో కరెంట్ సమస్య లేకుండా చేశారు.

గ్లోబల్ వార్మింగ్ మేఘాలు మనిషి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్రస్తుత తరుణంలో, నిబద్ధతతో పనిచేస్తూ ఒక చిన్న దేశం ఆ సమస్యకు తనదైన 'సుస్థిర' పరిష్కారాన్ని చూపింది.

సామాజిక వనరులను సక్రమంగా వినియోగించుకుంటే సుస్థిర అభివృద్ధి ఎలా సాధ్యమో మిగతా దేశాలకు తెలియచేసింది. పేద దేశాలు తమంతటతాము ఆహార సార్వభౌమత్వాన్ని సాధించలేవని నమ్మచూపే బహుళ జాతి కార్పోరేట్ కంపెనీలకు క్యూబా విజయం ఒక చెంపపెట్టు. అయితే సహజంగానే ఈ చిన్న దేశం సాధించిన విజయాలు పశ్చిమ దేశాల ఆధిపత్యంలోని మీడియా కంటికి కనబడలేదు. నిష్పాక్షికంగా ఉండాల్సిన డబ్ల్యుడబ్ల్యుఎఫ్ నివేదికల్లోనూ ఈ విజయాల ప్రస్తావన అంతంతమాత్రమే. ఎందుకంటే క్యూబా సేంద్రియ విప్లవం బహుళ జాతి కార్పోరేట్ సంస్థల ప్రయోజనానికి విఘాతం.....

2007వ సంవత్సరంలో ప్రధానమంత్రి ప్యాకేజి కింద నాబార్డు వారి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాకు 15000 హెక్టార్ల భూమిని అభివృద్ధి చేసే నిమిత్తం డబ్ల్యుడిఎఫ్ కార్యక్రమం మంజూరు అయ్యింది. రైతుల ఆత్మహత్యలు, సమస్యలు ఎక్కువగా ఉన్న జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లా ఒకటి.

ఈ కార్యక్రమం అమలు నేపథ్యంలో మద్దతు సేవలు అందించటానికి కొన్ని జిల్లాలకు ఆర్‌ఎస్‌ఓగా వాసన్‌కు బాధ్యత ఇచ్చారు. కార్యక్రమం అమలు పరచటానికి జిల్లాలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను కలిసి వారికి సహజ వనరుల యాజమాన్యంపై ఎంత అనుభవం ఉంది, ప్రస్తుతం వారు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలతో వారికి ఉన్న సంబంధాలను తెలుసుకుని ఈ కార్యక్రమం అమలుకు ఆరు పిఎఫ్ఏలను ఎంపిక చేశారు. ఇందులో 2004 నుండి నాబార్డు వారు రెండు పిఎఫ్ఏలతో కలిసి పనిచేస్తున్నారు. కొత్త సంస్థలు నాలుగు.

టోపోషీట్ల సహాయంతో డ్రెయిన్స్, కాంటూర్స్ ఆధారంగా వాటర్‌షెడ్ ప్రాంతాలను గుర్తించటానికి పిఎఫ్ఏలకు వాసన్ సహాయం చేసింది. ఆ తరువాత పిఎఫ్ఏలు గుర్తించిన ప్రాంతాలకు సంబంధించి భూమి, జనాభా, పశుసంపద, కులాల వారి సమాచారం, భూమి లేని వారి సమాచారంతో వాటర్‌షెడ్ డేటాషీట్లు పూర్తి చేశారు. వాటర్‌షెడ్లకు ప్రతిపాదనలు పంపించారు. పిఎఫ్ఏలు పంపిన ప్రతిపాదనలు, సమాచారాన్ని అధ్యయనం చేసి, గ్రామాలు తిరిగి భూములు, వాగులు, గ్రామ పరిస్థితి వాసన్ సిబ్బంది చూశారు. గ్రామసభ పెట్టి వాటర్‌షెడ్‌పై గ్రామస్తులకు ఉన్న సమాచారం, అవగాహన అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే సమయంలో వారికి డబ్ల్యుడిఎఫ్ వాటర్‌షెడ్ ఉద్దేశాలు తెలిపారు. వీటన్నిటి ఆధారంగా ప్రతిప్రాదనలకు బృంద అభిప్రాయాలు జోడించి, సరి చేయించి నాబార్డ్‌కు పంపించారు. నాబార్డు వారు వాటిని తనిఖీ చేసి కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదించారు. ముందుగా అర్హత శ్రమదానం చేయాలని పిఎఫ్ఏలకు ఉత్తరాలు పంపించారు.

**కళాజాత:**

అర్హత శ్రమదానం కన్నా ముందు గ్రామాలలో డబ్ల్యుడిఎఫ్ కార్యక్రమంపై అవగాహన నిమిత్తం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కళాజాత కార్యక్రమంలో డబ్ల్యుడిఎఫ్ ఉద్దేశం, అర్హత శ్రమదానం ఉద్దేశం, ప్రాముఖ్యత, వాటర్‌షెడ్ ఆమోదం గురించి, ప్రారంభ దశ అయిన సామర్ధ్యం పెంపుదల దశ (సిబిపి) గురించి, అందులో చేసుకునే పనులు, అవకాశాలు, పనులు ఎవరు చేసుకోవాలి అన్న విషయాలు చెప్పారు. స్వచ్ఛందంగా పనిచేసే గ్రామ వాటర్‌షెడ్ అభివృద్ధి సంఘం (విడబ్ల్యుడిసి), సిబిపి పూర్తి అయిన తరువాత పూర్తి అమలు దశ (ఎఫ్ఐపి) గురించి, దాని అమలు తీరు గురించి కళాజాత బృందం వివరించింది. పాటలు, నాటికలు, జానపద నృత్యాల

## మాదాపూర్‌లో కళాజాత పద ఘట్టనలు

మహబూబ్‌నగర్ జిల్లా లింగాల మండలం మాదాపూర్‌లో కోనేర్ సంస్థ పిఎఫ్ఏగా పనిచేస్తోంది. 22.11.07 నాడు మధ్యాహ్నం 12 గంటలకు కళాజాత బృందం మాదాపూర్ గ్రామానికి చేరుకుని గ్రామం మొత్తం డప్పుల్ని కొడుతూ తిరుగుతూ నాబార్డ్ వారి వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు సాయంత్రం 6 గంటలకు అంగన్‌వాడి కేంద్రం దగ్గర తెలియ చేస్తారని చెప్పి అందరినీ ఆహ్వానించారు. సాయంత్రం 4 గంటలకు మహిళా సంఘాలు, పెద్దలు, పిల్లలు అందరూ కలిసి నాబార్డ్ వాటర్‌షెడ్ గురించి నినాదాలు ఇచ్చుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం వరకు ర్యాలీ తీశారు. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు నాబార్డ్ వాటర్‌షెడ్ కార్యక్రమంపై కళాజాత జరిగింది. దీనికి మహిళలు 72 మంది, పురుషులు 115 మంది, పిల్లలు 20 మంది వెరసి మొత్తం 205 మంది హాజరయ్యారు.

**అభిప్రాయాలు:**

గ్రామస్తుడయిన అవుట చిన్న బాలస్వామి ఇలా అభిప్రాయపడ్డారు: మాకు కళాజాత కార్యక్రమం ద్వారా అంటే పాటలు, నాటకం ద్వారా నాబార్డ్ వాటర్‌షెడ్ గురించి చాలా బాగా చెప్పారు. వలస వెళ్లకుండా మన గ్రామంలోనే పనులు

ద్వారా గ్రామస్థాయిలో అర్థమయ్యే విధంగా తెలియ చేశారు. కళాజాత జరిగిన తరువాత ప్రజలు బాగా స్పందించసాగారు. కళాజాత కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు, ఆడ, మగ అనే బేధం లేకుండా అందరూ వచ్చారు. ఈ కళాజాత కార్యక్రమం 2007 నవంబరులో జరిగింది.

## అర్హత శ్రమదానం:

ఒక గ్రామానికి వాటర్‌షెడ్ మంజూరు కావాలంటే ముందుగా వాటర్‌షెడ్ ప్రాంతంలో వచ్చే రైతులు మొత్తం శ్రమదానం చేయాలి అన్నది ఒక నిబంధన. భూమి ఉన్న వారు × 4 రోజులు × 80 రూపాయల ప్రకారం ఎంత అయితే అంత విలువ గల పని శ్రమదానంగా చేయాలి.

మాదాపూర్ గ్రామంలో కూడా కళాజాతా అయిన వెంబడే అర్హత శ్రమదానం 2007 డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించారు. 98 కుటుంబాల వారు వరసగా 5 రోజుల శ్రమదానంలో 31,200 రూపాయల విలువ గల చిన్నకుంట పని పూర్తి చేశారు. ఈ శ్రమదానంలో ఆడవారు, మగవారు అందరూ పాల్గొన్నారు. మొదటిరోజు 75 మంది, 2వ రోజు 50 మంది, 3వ రోజు 50 మంది, 4వ రోజు 5వ రోజు 113 మంది పని చేశారు. ఈ శ్రమదానంలో పెద్ద, చిన్న అనే బేధం లేకుండా గ్రామ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. 5వ రోజు శ్రమదానం చేసి అక్కడే కుంట వద్ద అందరూ బియ్యం, డబ్బులు పోగేసుకుని పెద్దవిందు కార్యక్రమం చేశారు. 'మా గ్రామస్తులం అందరం స్వచ్ఛందంగా ఐకమత్యంతో కలిసి ఈ కుంట వేశాం. కాబట్టి పెద్ద పండుగగా మేం భావించాం. అందుకే పండుగ చేసుకుంటున్నాం' అని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు, ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇందులో చెప్పుకోవలసిన విషయం ఒకటుంది. మాదాపూర్ గ్రామంలో మొహమ్మద్ అలీ కొడుకైన పాషా రెండు కాళ్ళు లేని వికలాంగుడు. కనీసం కుంటుతూ కూడా నడవలేని వ్యక్తి. ఇతడు నాలుగు రోజులు శ్రమదానం చేశాడు. 'పాషా! శ్రమదానం చేయవలసిన అవసరం లేదు' అని చెప్పినప్పుడు అతను 'ఇది మా గ్రామానికి వచ్చిన అదృష్టం. ఈ డబ్ల్యుడిఎఫ్ కార్యక్రమం వల్ల మా గ్రామంలోని పొలాలు బాగుపడతాయి, నీటిమట్టం పెరుగుతుంది. దీనివల్ల ఎవ్వరం బయటికి వెళ్ళకుండా మా గ్రామంలోనే ఉండి పని చేసుకోవచ్చు. ఇంతమంచి కార్యక్రమం వచ్చినప్పుడు నేను నాలుగు రోజులు శ్రమదానం చేయలేనా, నేను తప్పకుండా చేస్తాను. వద్దు అని చెప్పవద్దు, అందరితోపాటు నేను కూడా నా శక్తి ఉన్నంతవరకు పారపట్టి పనిచేస్తాను' అని ఎంతో ఉత్సాహంగా పనిచేశాడు. పాషాను చూసి చాలామంది అర్హత శ్రమదానంలో పాల్గొనేందుకు ముందుకు వచ్చారు. శ్రమదానం ప్రారంభించిన రోజు, పండగ చేసుకున్న రోజు జ్ఞాపకం కోసం వీడియో రికార్డు

మిగతా 10వ పేజీలో

కలిపించుకొని ఇక్కడే బతకవచ్చు. ముఖ్యంగా సింగి, సింగడు అనే నాటకం ద్వారా కార్యక్రమం, ఉద్దేశాలు పూర్తిగా మాకు అర్థమయ్యాయి.

డిప్యూటీ సర్పంచ్ అయిన మహమ్మద్ జహంగీర్ కళాజాత కార్యక్రమాన్ని తిలకించి తమ సంతోషాన్ని తెలియ చేశారు. నాబార్డ్ వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని కోనేర్, వాసన్ సంస్థలు మా గ్రామానికి తీసుకురావడం మా అదృష్టంగా భావిస్తున్నాం అంటూ నాబార్డ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామసంఘం లీడర్ బాలేబీ కళాజాతా కార్యక్రమానికి నాబార్డ్, కోనేర్, వాసన్ సంస్థలకు మహిళా సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియ చేశారు. డబ్ల్యుడిఎఫ్ వాటర్‌షెడ్లలో మహిళలకూ అవకాశం ఉన్నందుకు చాలా సంతోషిస్తున్నాం అని చెప్పారు. మా గ్రామం బాగుపడుతుంది, ప్రజలు బాగుపడతారు. అందుకు మాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.

సర్పంచ్ తిరుపతయ్య మాట్లాడుతూ ముందుగా కళాజాత బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి వాటర్‌షెడ్ కార్యక్రమం తీసుకువచ్చిన కోనేర్, వాసన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియ చేశారు. 'నాబార్డు వాటర్‌షెడ్ కార్యక్రమం జరగాలంటే ముందుగా మనమందరం ఇంటికి ఒకరు 4 రోజులు చొప్పన శ్రమదానం చెయ్యాలి. చేసి చూపిస్తేనే వాటర్‌షెడ్ వస్తుంది కాబట్టి అందరం శ్రమదానం చేద్దాం' అని అన్నారు.




## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆలోచనలు - సూచనలు

**జా**తీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆలోచనలు - సూచనలు అనే పుస్తకం 2007లో ఆవిష్కరించారు. దీనిని కె.ఎస్. గోపాల్, డైరెక్టర్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ (సి.ఇ.సి.) రాశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ వారు సంయుక్తంగా దీనిని ముద్రించారు.

ఈ పుస్తకంలో ముఖ్యంగా గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, ఫలితాలు అందించడంలో అవి ఏవిధంగా విఫలం అవుతున్నాయో వివరించారు. ఇదే తరహాలో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం, తద్వారా ఆహార భద్రత, ఆస్తుల నిర్మాణం, మెట్ట ప్రాంతాలలో వ్యవసాయ అభివృద్ధి, కూలి సంఘాలు నెలకొల్పటం, సామాజిక తనిఖీ, దానిని అనుసరిస్తూ ప్రభుత్వ విధానం, పెట్టుబడులు వంటి ఉత్ప్రేరకాలను దీనిలో చేపట్టాలని వివరించారు. ఉపాధి హామీ చట్టాన్ని హక్కుగానే అందించినంత మాత్రాన అది విజయం సాధించలేదని వివరించారు. ఈ పుస్తకం ఎన్ఆర్ఇజిఎ, ఇతర ఉపాధి పథకాల అధ్యయనానికి మాత్రమే పరిమితం చేశారు.

ఇందులో ఉన్న ఏడు అధ్యాయాల ద్వారా ఉపాధి హామీ చట్టం, అమలు తీరు, చేపట్టే పనులు, సాంకేతిక సహకారం, సామాజిక తనిఖీ, చట్టం అమలు పరిచే క్రమంలో వస్తున్న సమస్యలు, కూలీల హక్కుల అమలు న్యాయం, ఎన్‌జిఓల పాత్రను తెలియ చేశారు. విమర్శనాత్మక పరిశీలన ద్వారా వీటిని సమర్ధవంతంగా నిర్వహించడానికి ఆలోచనలు - సూచనలు అందచేశారు. దీనిలో న్యాయం పేరుతో గల అధ్యాయాన్ని కె.ఆర్.వేణుగోపాల్ రాశారు. 'Capturing Imagination of Stakeholders - National Rural Employment Guarantee Act' యొక్క సంక్షిప్త తెలుగు అనువాదమే ఈ పుస్తకం. దివంగత పద్మభూషణ్ కాళోజీ నారాయణరావుకు దీనిని పుస్తక రచయిత అంకితమిచ్చారు.

వెల: సంస్థలకు రూ.100/-, కార్యకర్తలకు రూ. 50/-,

పుస్తకాల కోసం: **ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ**, 12-13-485/5, నాగార్జున నగర్, సికింద్రాబాద్ 500 017, ఫోను: 040 27150233, 27150557

ఇ-మెయిల్: apmss_ms@yahoo.co.in

**సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్**, 3-4-142/6, బర్కత్‌పురా, హైదరాబాద్ 500 027, ఫోను: 040-27564959, 27563017

ఇ-మెయిల్: ceched@eth.net

## మహబూబ్‌నగర్ జిల్లాలో డబ్ల్యుడిఎఫ్ ప్రగతి

9వ పేజీ తరువాయి

కూడా చేయించారు.

అర్హత శ్రమదానం పూర్తి అయిన వెంటనే గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పిఆర్ఏ ద్వారా 100 హెక్టార్ల సిబిపి ప్రాంతాలు గుర్తించారు. ఈ 100 హెక్టార్ల భూమిని డ్రైయిన్ ఆధారంగా తీసుకున్నారు. అందులో వచ్చిన రైతుల వివరాలు తీసుకున్నారు. ఈ సిబిపి 100 హెక్టార్ల ప్రాంతం ఒక పరీక్ష వంటిది కాబట్టి అందరికీ చూపేందుకు వీలుగా రోడ్డుకు దగ్గరగా, గ్రామానికి దగ్గర ఉండేలా చూశారు. అంతేకాకుండా ఇందులో చిన్న, సన్నకారు రైతులు ఉండేటట్లు చూసి గుర్తింపు చేశారు.

సిబిపి రైతుల వివరాలు తీసుకుని వ్యక్తిగత రైతులతో కలిసి వారి పొలాల వద్దకు వెళ్ళి భూమి వాలు, కొలతలు తీసి ఒక్కొక్కరి పొలం తిరిగి పిఎఫ్ఏ బృందం భూ వినియోగ ప్రణాళిక తయారు చేసింది. ఈ ప్రణాళిక చేయటానికి ముందు పిఎఫ్ఏ సిబ్బందికి వాసన్ సంస్థ మూడు రోజుల శిక్షణ హైదరాబాదులో ఇచ్చింది. ఆ తరువాత రెండు రోజులు వనపర్తిలో క్షేత్రస్థాయి శిక్షణ జరిగింది. ఈ శిక్షణలు 2007 నవంబరులో జరిగాయి.

పిఎఫ్ఏ సంస్థలు సిబిపి ప్రణాళికలు తయారు చేసి నిర్దేశించిన ఫార్మాట్లలో ఆర్ఎస్ఓకి పంపించారు. ఈ ప్రణాళికల క్షేత్ర అంచనాను వాసన్ సిబ్బంది చేపట్టి మార్పులు, చేర్పులు ఉంటే తెలియ చేసి అభిప్రాయాలను ప్రణాళికకు జతపరిచి నాబార్డుకు పంపించారు. ఇప్పటివరకు మహబూబ్‌నగర్ జిల్లా నుండి యధిర, గాలిగూడెం, మాదాపూర్, మెట్టుపల్లి వాటర్‌షెడ్ల ప్రణాళిక నాబార్డుకు పంపారు. మైలారం, వీరంరాజుపల్లి, పద్మారం, గోకుల నగర్ వాటర్‌షెడ్ల అంచనా కార్యక్రమం పూర్తి అయ్యింది. లింగారెడ్డిపల్లిలో ప్రణాళిక తయారు అవుతోంది. ఏప్రిల్ నెలలో గడిమిన్‌కన్‌పల్లి, దేశాయిపల్లి, బావాజిపల్లి, దుప్పటి గట్టు గ్రామాల అంచనా జరగనుంది.

**- యం. సుమిత్ర, వాసన్**

# ప్రయోగాత్మకంగా మేక పిల్లల సంరక్షణ కేంద్రం

గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధులు వ్యవసాయం తరువాత ముఖ్యంగా పశువులపై ఆధారపడి ఉన్నాయి. కాలానుగుణంగా పశువులను సాదే దానిలో కూడా మార్పులు వస్తున్నాయి. వెనకటి రోజుల్లో పశువులు ఎక్కువగా ఉన్న ఇళ్ళల్లో ఆడవారు పశుపోషణలో ఎక్కువ సమయం వెచ్చించేవారు. నేడు పరిస్థితి మారింది. అన్ని రకాల పశువులను అన్ని రకాల కులాల వారు సాదుతున్నారు. ఉమ్మడి కుటుంబాలు వ్యక్తిగత కుటుంబాలుగా విడిపోవటం వల్ల, ఇంటిముందు స్థలాలు తగ్గటం వల్ల అన్ని పనులతో పాటు పశుపోషణ చేయటం కూడా కష్టంగా మారింది.

పైన వివరించిన సందర్భాలలో మేకలపై జీవనం సాగిస్తున్న వారు మేక పిల్లల యాజమాన్యంలో పాటిస్తున్న పద్ధతులు ఇలా ఉన్నాయి:

- మేక పిల్లలను (10-12) జల్ల గంప కింద ఉదయం నుండి సాయంత్రం వరకు ఉంచుతారు
- మేక పిల్లలు ఉదయం తల్లిపాలు తాగితే మళ్ళీ రాత్రికే పాలు తాగుతాయి
- ఆ మధ్య సమయంలో జల్ల గంపకు కట్టిన వేప ఆకులను తింటాయి
- మేక పిల్లలకు కావలసిన మంచినీరు కూడా ఉండవు

**వీటివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు:**

1. 10-12 పిల్లలు జల్ల గంప కింద ఉండటం వల్ల సరి అయిన గాలి, వెలుతురు తగలకపోవటం
2. అక్కడే మూత్రం, పెండ వేయటం వల్ల అమ్మోనియా వాసనతో శ్వాసకోస సంబంధ వ్యాధులు సోకటం
3. పిల్లలు ఒకే దగ్గర ఉండటం వల్ల అంటువ్యాధులు ఒకదాని నుండి ఒకదానికి సోకుతున్నాయి. దాంతో పిల్లల్లో మరణాల శాతం ఎక్కువగా ఉండటం
4. కావల్సినంత తిండి, మంచినీరు అందుబాటులో ఉండకపోవటం

కొన్ని సందర్భాలలో ఇంటి దగ్గర ఉండేవారు లేకపోవడం వల్ల పిల్లలను కూడా తల్లి మేకలతో పాటు మేపుకు తీసుకువెళ్తున్నారు. తల్లిమేక నడిచినంత దూరం పిల్ల మేక నడవాల్సి వస్తుంది. దాంతో పిల్లల శరీర బరువు పెరగటం లేదు.

అనుభవం వున్న డాక్టర్లు, మేకల పెంపకందార్లతో ఈ సమస్యల



గురించి మాట్లాడినప్పుడు వీటి నుండి బయటపడటానికి మేకపిల్లల సంరక్షణ కేంద్రం అన్న ఆలోచన వచ్చింది. దీనిలోని ముఖ్య అంశాలు:

- మేక పిల్లల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు కావల్సిన స్థలాన్ని మేకల కాపరులే సమకూర్చుకుంటారు
- కొట్టం వేసుకునేందుకు కర్రలు సమకూర్చుతాం
- ఇనుప జాలి, నీటి తొట్లు, మేత తొట్లు, దాణా, సంరక్షకుని జీతం ప్రాజెక్టు నుండి చెల్లిస్తారు
- ఒక మేకపిల్లకు ప్రవేశ రుసుం 10రూపాయలు
- సేవా రుసుం కింద ఒక మేక పిల్లకు ప్రతినెలా 5 రూపాయలు కట్టాలి
- కావలసిన డేటాషీట్లు రూపొందించి, ఉపయోగిస్తున్నారు
- ముందుగా నిర్ణయించిన తేదీన పారావర్కర్ సందర్శిస్తారు
- షెడ్యూలు ప్రకారంగా టీకాలు వేస్తారు, నట్టల మందు తాగిస్తారు

పైన చెప్పిన విధంగా మహబూబ్‌నగర్ జిల్లా, దౌలతాబాద్ మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో గోపాలకృష్ణ మేకల సంఘం వారు ప్రారంభించారు. ఆరు నెలలు గడిచిన తరువాత లాభాలను బేరీజు వేసుకుని తరువాత చెయ్యవలసిన కార్యక్రమ రూపకల్పన జరుగుతుంది.

**- ఎస్. భాగ్యలక్ష్మి, వాసన్**

భ్రమరాంబ మహిళా గ్రూపు చెన్నపురావు గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో ఉంది - ఈ బృందం వాళ్ళు 2002 సంవత్సరంలో 3.25లక్షల రూపాయలను స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్‌గార్ యోజన పథకం ద్వారా అప్పుగా తీసుకున్నారు. ఈ డబ్బుతో వీళ్ళు 4.5 ఎకరాల మెట్ట పొలం కొని బోరు వేసుకున్నారు. ఆ పొలంలో 2 ఎకరాలలో మల్లెతోట (కాగడ/బొడ్డుమల్లె) సాగు చేస్తున్నారు. మిగతా 2.5 ఎకరాలలో కొంతభాగం వరి, కొంతభాగం వేరుశనగ పండిస్తున్నారు. వీరు క్షేత్రం చుట్టూ 100 టేకు మొక్కలను కూడా నాటుకున్నారు. రబీ 2006లో వేరుశనగను పురుగు మందులు వాడకుండా పండించారు. దీనివల్ల పురుగు నివారణకు ఎకరాకు సుమారుగా 700 రూపాయలు తక్కువ ఖర్చు అయ్యింది. ఈ విధమైన అనుభవాలతో వరిలో కూడా శ్రీ పద్ధతిలో విత్తనోత్పత్తి చేయమని గ్రామ కార్యకర్త, వాసన్ సలహాదారుడు కన్నయ్య, బాలస్వామి ప్రోత్సహించారు. దీనికి గ్రూపు సభ్యులు ఇష్టపడలేదు. గ్రూపు లీడరు శ్రీమతి బాలమ్మ అర ఎకరంలో వేసి చూద్దామని సభ్యులకు తెలియ చేసింది. దీని ప్రకారం అర ఎకరంలో జెజిఎల్ 1798 రకంతో శ్రీ పద్ధతిలో, 1 ఎకరంలో బిపిటి 5204 సామాన్య పద్ధతిలో సాగు చేశారు. 45 రోజుల తరువాత శ్రీ పద్ధతిలో ఎక్కువ పిలకలు వేయటం చూసి గ్రూపు సభ్యులు ఆశ్చర్యపోయారు.

## శ్రీ పద్ధతిలో వరిసాగు విత్తనోత్పత్తికి బాగు



గ్రూపు సభ్యులు ఒక కిలో జెజిఎల్ 1798 (బ్రీడరు) విత్తనం సమాఖ్య సహకారంతో కొన్నారు. దీనిని 12 గంటలు నానబెట్టి, ఎత్తు మడిలో నారుపోశారు. ప్రధాన పొలం తయారీ ఆలస్యం అవ్వటంతో 13 రోజులు వయస్సు ఉన్న వరి మొక్కలను నాటారు. రోటరీ వీడరు (కలుపు యంత్రం) వాడటంలో అనుభవం లేనందున దానిని నడపటం కష్టతరమయ్యింది. గ్రామ కార్యకర్త కన్నయ్య సహకారంతో రోటరీ వీడర్‌ను రెండుసార్లు నడిపారు. దీనికి ప్రతిఫలంగా కన్నయ్య క్షేత్రంలో గ్రూపు సభ్యులు ఒకరోజు కలుపు తీశారు. శ్రీవరి పొలంలో ఉన్న బెరుకులు - కేళీలను వాసన్ సలహాదారుడు మద్దిలేటి, గ్రామ కార్యకర్త పర్యవేక్షణలో తీసివేశారు.

### రసాయనిక పురుగు మందులు వాడకుండా పంటసాగు చేసిన యాజమాన్య పద్ధతులు:

నారుమడి నుండి పంట కోసే వరకు కాండం తొలిచే పురుగుపై నిఘా పెట్టారు. తల్లిపురుగు గుడ్లు పెట్టకుండా రెండుసార్లు పశువుల పేడ, మూత్రం ద్రావణాన్ని పిచికారి చేశారు. అంతేకాకుండా వివిధ పురుగులను అదుపు చేయటానికి 5 ఆకుల కషాయం, తెగుళ్ళ నివారణకు, పెరుగుదలకు పంచగవ్య, ఇంగువ ద్రావణం పిచికారి చేశారు. పచ్చదోమ నివారణకు పసుపు పళ్ళాలు పెట్టారు.

భ్రమరాంబ గ్రూపు అనుభవాలు చూస్తే సామాన్య పద్ధతి, శ్రీ పద్ధతిలో మొత్తం మీద సాగు ఖర్చులో పెద్ద తేడా రాలేదు. అయితే దిగుబడి బాగా పెరిగింది. అర్ధ ఎకరంలో సుమారుగా 27 బస్తాలు (70 కిలోలవి) పంట లభించింది. గడ్డి దిగుబడి కూడా సాధారణ పద్ధతి కంటే రెట్టింపు లభించింది. ఈ విధంగా నికర ఆదాయం గణనీయంగా పెరిగింది.

శ్రీ పద్ధతి ద్వారా విత్తన ఉత్పత్తి చేపడితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఒక కిలో విత్తనంతో 2000 కిలోల దిగుబడి సాధించారు. దీనిని తిరిగి శ్రీ పద్ధతిలో ఉపయోగిస్తే వెయ్యి ఎకరాలకు సరిపోతుంది. మామూలు పద్ధతిలో పండించినా 70-80 ఎకరాలకు విత్తనం సరఫరా చెయ్యవచ్చు.

తమ అనుభవాలతో భ్రమరాంబ గ్రూపు సభ్యులు ముందుకు ఎలా వెళతారో వేచి చూడాలి.

**- బాలస్వామి, వాసన్**

# ఉపాధి హామీ పథకం అమలులో స్వచ్ఛంద సంస్థల పాత్ర

గ్రామీణాభివృద్ధి శాఖ, జిఓ-ఎన్‌జిఓ సమన్వయ కమిటీ, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 17, 2008న మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఒకరోజు వర్క్‌షాపు జరిగింది. దీనిలో 18 జిల్లాల నుండి 220 మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అపార్డ్ కమీషనర్ ఉమా మహేశ్వరరావు, ఐఎఎస్, జిఓ-ఎన్‌జిఓ సమన్వయ కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాలరావు, ఐఎఎస్ (రి) ఉదయపు కార్యక్రమం నిర్వహించారు. మూడవ విడతలో ఏప్రిల్ 2008 నుండి రాష్ట్ర వ్యాప్తంగా (కృష్ణా, గోదావరి, విశాఖపట్టణం) కార్యక్రమం విస్తరించడాన్ని ఎ.మురళీ, డైరెక్టర్ (ఇజిఎస్), తెలుపుతూ ఉపాధి హామీ పథకం గురించి, అమలు, పనితీరు గురించి వివరించారు. సామాజిక తనిఖీ, అమలు గురించి వి.కరుణ, డైరెక్టర్, ఎస్‌పిఐయు (ఆర్.డి) వివరించారు.

ఈ వర్క్‌షాపునకు ప్రభుత్వం తరపున ముఖ్య అతిధిగా విచ్చేసిన గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ, కె.రాజు, ఐఎఎస్, ముఖ్యంగా మూడు అంశాలను ప్రస్తావించారు:

- ❑ పేద ప్రజల హక్కులను సాధించే దిశగా ఆలోచన చేయడం
- ❑ వారి హక్కులను వారే సాధించుకునేలా తయారు చేయడం
- ❑ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు పరిచేలా చూడటం

జిఓ-ఎన్‌జిఓ సమన్వయ కమిటీపై మాట్లాడుతూ ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు.

1 కూలీ బృందాలను తయారుచేసే క్రమంలో అవసరమైన శిక్షణా కార్యక్రమాలకు ప్రభుత్వ సహాయం

2 జనాభా మొత్తంలో 63 శాతం వున్న ఎస్‌సి కుటుంబాలు 43 నుండి 46 శాతం మాత్రమే లబ్ది పొందుతున్నాయి. వీరికి మరింత ప్రయోజనం చేకూరేలా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి

3 ఒక పంచాయితీలో పనికోరే కుటుంబాలు 400 ఉండి, వాళ్ళకు వందరోజులు పని కల్పించటానికి బడ్జెట్ తయారు చేయించగలిగితే బాగుంటుంది

4 సామాజిక తనిఖీలో ఇప్పటివరకు స్వచ్ఛంద సంస్థలు, యూనియన్లు రిసోర్స్ పర్సన్‌లుగా మాత్రమే పాల్గొంటున్నాయి. అలాకాకుండా ఎవరికైతే అమలులో పాల్గొనాలని వుందో వారు ముందుకు వస్తే, సామాజిక తనిఖీ అమలులో భాగస్తులను చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది.

ఈ కార్యక్రమానికి సంబంధించి జిఓ-ఎన్‌జిఓ సమన్వయ కమిటీ కొన్ని సిఫారసులు చేసింది:

- ❑ ప్రభుత్వం తరపున కూలీ బృందాలు / యూనియన్లను ఏర్పాటు చేయడం
- ❑ ఎస్‌సి/ ఎస్టీ కులాలకు చెందిన, ముఖ్యంగా నిరుపేద కూలీలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం సమర్ధవంతంగా అమలయ్యేలా చూడటం



- ❑ ఎస్‌సి/ ఎస్టీ కూలీలు అధికంగా వున్న గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎస్‌సి/ ఎస్టీ సభ్యులను ఎన్నుకోవడం
- ❑ ఇందిరమ్మ చెరువు, ఇళ్ళ కోసం వచ్చిన జిఓలను ప్రత్యేకంగా ఉపయోగించుకొని పట్టా భూములను అభివృద్ధి పరచడం
- ❑ ప్రత్యేక జిఓ ద్వారా స్వచ్ఛంద సంస్థల పాత్రను తెలియ చేయడం
- ❑ మండల, జిల్లా స్థాయి జిఓ-ఎన్‌జిఓ సమన్వయ కమిటీలను ఏర్పరచి తరచుగా సమావేశాలు నిర్వహించేలా చూడటం

యంగ్ ఇండియా (ప్రాజెక్టు (బేడి), పీపుల్స్ మానిటరింగ్ కమిటీ (సత్యబాబు), సిఎస్ఆర్‌డి (బోస్), బిసిటి (శ్రీనివాసరావు), ఆంధ్రప్రదేశ్ దళిత ఫోరం (కె.శ్రీనివాస్), దళిత బహుజన్ శ్రామిక్ యూనియన్ (రాజేంద్ర, రామలింగం), డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కొండా రెడ్డీస్ కమ్యూనిటీ, రెడ్స్, వాసన్, సిడబ్ల్యుఎస్, ఎపి విమెన్స్ నెట్‌వర్క్ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ వర్క్‌షాపులో పాల్గొన్నారు.

- కల్పన, వాసన్

# చెల్కలో ఎరువు తయారీ

**భూ**సారం పెంచే పద్దతిలో ముఖ్యమైన వాటిలో పెంట ఎరువు ఒకటి. సాధారణంగా రైతులు పశువుల కొట్టం దగ్గర పెంట ఎరువు చేస్తారు. నానాటికి పశువుల సంఖ్య తగ్గటం వల్ల పెంట ఎరువు దొరకడం తగ్గుతోంది. ఉన్నకొద్ది ఎరువును నీటి ఆధార పొలాల్లో వేయడానికి రైతులు ప్రాధాన్యతనిస్తున్నారు. అందువల్ల వర్షాధార భూమిలో (చెల్కలలో) పెంట ఎరువు వేయడం చాలావరకు తగ్గిపోయింది. చెల్కలు అసలే సారం తక్కువ నేలలు. వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ కాలం ఎడం వస్తే ఎరువు అందుబాటులో లేకపోవడం వల్ల నేలలో తేమ నిలుపుకునే శక్తి తద్వారా పంట దిగుబడులు తగ్గి రైతులకు నష్టం జరుగుతుంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి తక్కువ పేడతో చెల్కలోనే ఎరువు తయారీ చేసే పద్ధతులు అవలంభించాలి. ఇందులో ఎరువు గుంత పద్ధతి ఒకటి.

ఈ పద్ధతిలో కేవలం 10 గంపల (50 కిలోల) పేడతో రెండు టన్నుల ఎరువు తయారు చేయవచ్చు. ఒక సంవత్సరంలో రెండు నుండి మూడుసార్లు ఎరువు తయారు చేయవచ్చు. అంటే సంవత్సరానికి ఆరు టన్నుల ఎరువు చెల్కకు వేయవచ్చు.

**ఎరువు గుంత వల్ల ఉపయోగాలు**

- ఎకరాకు ప్రతి సంవత్సరం రెండు టన్నుల ఎరువు వేసినట్లయితే నేలలో నీరు నిలుపుకునే శక్తి మూడురెట్లు పెరుగుతుంది
- పంట దిగుబడి పెరిగి ఖర్చు తగ్గుతుంది
- రసాయనిక ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు
- పంట ఆరోగ్యంగా పెరగడం మూలంగా చీడపీడలను తట్టుకుంటుంది
- చెల్కలోనే ఎరువు తయారు చేయటం వల్ల రవాణా ఖర్చు తగ్గుతుంది
- దీనికి పెట్టుబడి శ్రమ మాత్రమే

**గుంత పద్ధతిలో ఎరువు తయారీలో పనులు**

- గుంత తయారీ, గుంతచుట్టూ ఎరువాకు చెట్ల పెంపకం
- చెత్త, పేడ జమ చేయడం (ఎండుచెత్త రెండు ట్రాక్టర్ల మందం, పచ్చిఆకు పొరక 5 మోపులు)
- పేడ పది గంపలు
- ఎరువు కుప్ప వేయడం
- ఎరువు తయారీకి నీళ్ళు పోయడం
- కుప్ప తిరగవేయడం
- ఎరువు తీయడం, నిలవ చేయడం

***గుంత తయారీ:*** ప్రతి ఎకరా చెల్కకు ఒక ఎరువు గుంత తీసుకోవచ్చు. గుంతను చెట్టు నీడలో, చెల్కలోని నీరు బయటికి పోయే దగ్గర అయితే అనుకూలం. కాలవలు, ఎక్కువ వరద వచ్చే స్థలంలో గుంత ఏర్పాటు చేయకూడదు. అదేవిధంగా నీళ్ళ ఊటలుపైనే ఉండే దగ్గర కూడ గుంత ఏర్పాటు చేయకూడదు. నీరు ఎక్కువగా ఉంటే చెత్త కుళ్ళకుండా చాలారోజులు అలాగే ఉంటుంది. గుంతకు 4 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు, అర్ధమీటరు లోతు తవ్వాలి. తవ్విన మట్టిని (గుంతలోకి నీరు రావడానికి రెండు మీటర్ల స్థలం వదిలి) చుట్టూ కట్టగా పోయాలి. కట్టకూ గుంతకు మధ్య రెండు అడుగుల స్థలం వదిలి మట్టిపోయాలి. దగ్గరలో పోస్తే కట్టకు పోసిన మట్టి గుంతలోకి జారిపోతుంది.



గుంత దగ్గర చెత్త అందుబాటులోకి తీసుకురావడానికి గుంతచుట్టూ ఎరువాకునిచ్చే చెట్లను నాటాలి. దీనికోసం గ్లైరిసిడియా, అడవి తంగేడు (కాసియాసయా) లేదా కానుగ మొక్కలను నాటవచ్చు. గుంత చుట్టూ కట్టపైన రెండు వరసలలో అర్ధమీటరుకు ఒకటి చొప్పున 50 నుండి 60 మొక్కలను నాటుకోవచ్చు. ఈ చెట్లు పెద్దవి అయితే గుంతకు కావలసిన పచ్చి చెత్త గుంత దగ్గరే దొరికి శ్రమ ఖర్చు తగ్గుతుంది. ఇంకా చెల్క చుట్టూ గట్లపైన కూడా మొక్కలను నాటి పెంచినట్లయితే ఎరువుకు కావలసినంత చెత్త చెల్కలోనే దొరుకుతుంది.






**చెత్త జమ చేయడం:** చెల్కలోని పంట కొయ్యలను, కలుపు తీసిన కుప్పలను జమ చేయవచ్చు. వర్షాకాలంలో అయితే ఎక్కడ పడితే అక్కడ కలుపు గడ్డి - అలం విపరీతంగా దొరుకుతుంది. ఇది కూడా సేకరించవచ్చు. ఇలాంటి చెత్త రెండు ట్రాక్టర్ల మందం అవసరమవుతుంది. పచ్చి ఆకు చెత్త, కానుగ ఆకును గాని గ్లిరిసిడియా ఆకును గాని జిల్లెడి ఆకును గాని సేకరించవచ్చు. ఈ పచ్చి ఆకు మొత్తం 5 మోపులుంటే వరుసకింత వేయవచ్చు.

**పేడ:** పశువులున్న వారు అయితే ఇంటి దగ్గరగా చెల్కల్లో గాని పేడను 10 గంపలు జమ చేసుకోవాలి. పశువులు లేనివారు అడవిలో పశువుల తిరిగిన దగ్గర ఒకరోజు జమ చేయవచ్చు.

**ఎరువు కుప్ప వేయడం:** ఎండు/పచ్చి చెత్తను ఒక అడుగు మందం వరసలో పరవాలి. పచ్చిపారకు రెండు అంగుళాల మందం సరిపోతుంది. దీనిపైన ఒక బకెట్‌లో పేడనీళ్ళు కలిపి చెత్త వరసపైన చల్లాలి. చెత్త తడిచే విధంగా 5,6 బిందెల నీళ్ళు చల్లాలి. ఈ విధంగా చేయడం వల్ల పేడనీళ్ళు చెత్తనంతటిని తాకి తొందరగా కుళ్ళడానికి అవకాశం ఉంటుంది. తరువాత నేలపై మట్టిని 4-5 గంపలు కుప్పచేసి చెత్త వరస మీద సన్నని (అర్ధ అంగుళం మందం) పారలో చల్లాలి. ఈ విధంగా చేయడం వల్ల మట్టిలో వున్న సూక్ష్మజీవులు చెత్తను తొందరగా కుళ్ళే విధంగా చేస్తాయి. అంతేకాకుండా మట్టి తేమను పట్టుకుని ఉంటుంది. తరువాత చెత్త వరసను తొక్కుతూ గట్టి పరచాలి.

ఈ విధంగా మొత్తం అయిదు వరసల వరకు వేయాలి. గుంత మధ్యలో ఒక కట్టెను / గుంజను పాతాలి. పై వరసలో మట్టిని రెండు అంగుళాల మందం వేయాలి. ఎందుకంటే దీనివల్ల తేమ తొందరగా ఆరకుండా ఉంటుంది, నీటి ఆవశ్యకత కూడా తగ్గుతుంది.



**నీళ్ళు పోయడం:** వారం లేదా పది రోజులకు ఒకసారి 10 నుండి 15 బిందెల నీళ్ళు కుప్పపైన పోయాలి. తేమ లేక పోతే ఎరువు తయారయ్యే ప్రక్రియ ఆగిపోయి ఎరువు తయారుకాదు. వర్షాకాలం మాత్రం అంత అవసరం ఉండదు. ఈ విధంగా మొత్తం ఎరువు తయారయ్యే వరకు 10 సార్లు నీళ్ళు పోయాలి. ఏదైనా బోరు నీళ్ళు ఉంటే కుప్పలలోకి వదలకూడదు. ఎందుకంటే నీళ్ళు ఎక్కువైతే ఎరువు తయారయ్యే ప్రక్రియ ఆగిపోతుంది. కుప్పలలో తేమ మాత్రమే ఉండేవిధంగా తడపాలి. కుప్పపైన ఎండినట్లు ఉంటుంది. కానిలోపల తేమ పట్టుకుని ఉంటుంది. లోపలి చెత్తను తీసిపిండితే నీళ్ళు చేతికి తగలకుండా ఉంటే మంచిది. ఒకవేళ నీళ్ళు వచ్చాయంటే దాంట్లో నీళ్ళు ఎక్కువైనాయని అర్థం. ఈ విధంగా కాకుండా చూడాలి.




**కుప్పను తిరగవేయడం:** కుప్ప వేసిన 25 రోజులకు, 60 రోజులకు తిరగవేయాలి. ఈ విధంగా చేయడం వల్ల పైన చెత్త కిందకి, కిందనున్న చెత్త పైకి రావడం వల్ల ఎరువు తొందరగా మంచి నాణ్యంగా తయారు అవుతుంది. రెండుసార్లు తిరగేయడం సాధ్యం కాకపోతే కనీసం 60 రోజుల తరువాత తిరగవేయాలి. ఎందుకంటే అడుగులో ఉన్నది. పూర్తిగా ఎరువు తయారయి ఉంటుంది. పైనున్న వరస చెత్త సగం వరకు ఎరువు అవుతుంది. పై వరుస కిందికి, కింది వరస చెత్త పైకి చేసినట్లయితే కుప్పలోని చెత్త మొత్తం ఎరువుగా మారి నాణ్యమైన ఎరువు మనకు అందుబాటులోకి వస్తుంది.

**ఎరువు తీయడం, నిల్వ చేయడం:** ఎరువు తయారీకి 90 నుండి 100 రోజులు పడుతుంది. ఎరువు తయారయిన తరువాత గుంతలో నుండి తీసి వాడుకోవాలి లేదా చెట్టు నీడలో కుప్పగా పోసి చెత్తను కప్పి ఉంచాలి. లేదా మట్టితో కప్పాలి. ఈ విధంగా చేయడం వల్ల ఎరువు తేమగా ఉండి సారం కొట్టుకుపోకుండా ఉంటుంది. వరద నీరు వచ్చే దగ్గర కుప్ప వేయకూడదు.

మంచి ఎరువు ముక్కు దగ్గర పెట్టి చూసినాకాని చెడు వాసన రాదు. తొలకరి వర్షానికి నేల తడిస్తే ఎలాంటి వాసన వస్తుందో

మిగతా 16వ పేజీలో

# సిడబ్ల్యుఎస్ – ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ సెంటర్ ఆరంభం

సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సిడబ్ల్యుఎస్) స్వచ్ఛంద సంస్థ 1992 నుండి పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన గ్రామీణ ప్రజానీకం కోసం అమలు చేస్తోంది. సిడబ్ల్యుఎస్ సంస్థ, తార్నాక, సికింద్రాబాదు నుండి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, బీహార్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాలు, పుదుచ్చేరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను విస్తరింప చేసింది.

ఒరిస్సా, జార్ఖండ్, బీహార్, తమిళనాడు రాష్ట్రాలలో ఒక ఇన్‌చార్జి, 3-4 పోగ్రాం ఆఫీసర్లతో సిడబ్ల్యుఎస్ రిసోర్స్ సెంటర్‌నిర్వహించబడుతోంది. క్రమేణా ఈ రిసోర్స్ సెంటర్లు స్వయం ప్రతిపత్తి కలిగేలాగా రూపాంతరం చెందేందుకు కృషి జరుగుతోంది. ఇదే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా సిడబ్ల్యుఎస్ రిసోర్స్‌సెంటర్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా ఆలోచించి, చర్చలు జరిపి ఏప్రిల్ ఒకటి, 2008 నాడు ఆరంభించాం. సిడబ్ల్యుఎస్ సెంటర్ నుండి ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయటమన్నది అంత సులువుగా జరిగేది కాదు. ఎంతోమంది సిబ్బంది, కార్యక్రమాలు, భాగస్వాములు వీటన్నింటిని ఒక్కసారిగా స్వయం ప్రతిపత్తితో సిడబ్ల్యుఎస్‌తో అనుబంధంగా పని చేయించటం ప్రయోగాత్మకంగా సాధ్యం కాని పని. అందువల్ల ప్రస్తుతం పంచాయితీరాజ్ కార్యక్రమం, హెచ్ఐవి ఎయిడ్స్ కార్యక్రమాలతో మాత్రం ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ సెంటర్ ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభించబడింది. అతి త్వరలో మిగిలిన కార్యక్రమాలను కూడా రిసోర్స్ సెంటర్‌లో విలీనం చేయబడతాయి.

ఏప్రిల్ 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ రిసోర్స్‌సెంటర్ భాగస్వామ్య సంస్థల ప్రతినిధుల సమక్షంలో తార్నాకాలోని సెయింట్ ఆన్స్ జనరలేట్‌లో లాంఛన ప్రాయంగా ప్రారంభింపబడింది.

**- డా॥ సి.వి. శ్యామల, ఇన్‌చార్జి, ఎపిఆర్‌సి**



## చెల్కలో ఎరువు తయారీ

15వ పేజీ తరువాయి

అలాంటి వాసన వస్తుంది. అదేవిధంగా ఎక్కువ వేడి కూడా ఉండదు.

***ఎరువు వాడే విధానం:*** ఈ పద్ధతిలో ఎరువు పూర్తిగా అవుతుంది కాబట్టి పంట వేసేటప్పుడు సాళ్ళలో వేయవచ్చు. పంట పెరిగిన తరువాత మొక్క అడుగులో వేయవచ్చు. ఈ విధంగా వేయడం వల్ల ఎరువు వృధా కాకుండా ఉంటుంది. పెంట ఎరువు లాగా వెదచల్లితే ఎండకు దీనిలోని పోషకాలు నష్టపోయే అవకాశం ఉంటుంది.

PRINTED MATTER Book Post

To

**వాసన్**
12-13-450, వీధి నెంబరు 1, తార్నాక
సికింద్రాబాదు - 500017
**ఫోన్:** 040-27015295/27015296
Email: wassan@eth.net, Website: www.wassan.org

Printed with Financial Support from Sir Ratan Tata Trust

for private circulation only